క్లుప్తంగా

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డీఎస్పీ ప్రసాద్

అమలాపురం టౌన్: సైబర్ నేరాల పట్ల, స్మార్ట్ ఫోన్లకు వచ్చే అపరిచిత యాప్‌ల విషయంలో విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ సూచించారు. స్థానిక సర్ సీవీ రామన్ స్కూలులో విద్యార్థులకు పట్టణ పోలీసులు నేర నిరోధంపై సోమవారం నిర్వహించిన అవగాహన సదస్సులో డీఎస్పీ మాట్లాడారు. మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాల నిరోధానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను సైతం వివరించి అవగాహన కల్పించారు. పట్టణ సీఐ పి.వీరబాబు పట్టణంలో అనివార్యమవుతున్న ట్రాఫిక్ సమస్యపై మాట్లాడారు. పట్టణ ఎస్సై కిషోర్‌బాబు, ట్రాఫిక్ ఎస్సై ఏసుబాబు, సీవీ రామన్ స్కూలు డైరెక్టర్ రవణం వేణుగోపాలరావు తదితరులు సదస్సులో పాల్గొన్నారు.

క్యాలెండర్ ఆవిష్కరణ



కార్పెంటర్ చేతి వృత్తుల సంఘం క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

అమలాపురం టౌన్: జిల్లా కార్పెంటర్ చేతి వృత్తుల సంక్షేమ సంఘం 2025 సంవత్సరానికి ముద్రించిన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం స్థానిక సంఘ కార్యాలయంలో సోమవారం జరిగింది. సంఘం జిల్లా అధ్యక్షుడు దేవాదుల సూర్యనారాయణ మూర్తి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో జిల్లా అల్డా చైర్మన్ యాళ్ల దొరబాబు, జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి మోకా వెంకట సుబ్బారావులు క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు గున్నేపల్లి భీమశంకరం, కేవీవీ సాయిరామ్, నల్లా సత్తిబాబు, సుంకర సాయి తదితరులు పాల్గొన్నారు.

కూలేందుకు సిద్ధం.. చర్యలు శూన్యం!



వాసాలతిప్పలో శిథిలావస్థకు చేరిన ఓవర్ హెడ్ ట్యాంకు

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయతీ పరిధిలోని వాసాలతిప్ప గ్రామంలో ప్రధాన రహదారి చెంతనే ఉన్న ఆర్‌డబ్ల్యూఎస్ ఓహెచ్ఆర్ (ఓవర్ హెడ్ ట్యాంకు) శిథిలావస్థకు చేరింది. ఈ ఓహెచ్ఆర్ ద్వారా గతంలో గ్రామాలకు తాగునీటి సరఫరా జరిగేది. కాలక్రమంలో శిథిలావస్థకు చేరడంతో నిరుపయోగంగా మారింది. అయితే శిథిలమైన ఓహెచ్ఆర్‌ను తొలగించకుండా అలానే వదిలేశారు. దీంతో ఇటుగా ప్రయాణించేవారు బిక్కుబిక్కుమంటూ రాకపోకలు చేస్తున్నారు. ఇది ఎప్పుడు కూలుతుందోనని భయాందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

అగ్ని ప్రమాద బాధితులకు ఆర్థిక సాయం



బాధితులకు నిత్యావసరాలు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

అల్లవరం: ఇటీవల దేవగుప్తంలో జరిగిన అగ్ని ప్రమాదంలో సర్వం కోల్పోయి నిరాశ్రయులైన బుంగా మారతమ్మ కుటుంబానికి మోసుగంటి గంగయ్య మెమోరియల్ ఎడ్యుకేషనల్ చారిటబుల్ ట్రస్ట్, రుద్రరాజు సీతారాజు మెమోరియల్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ సంయుక్త ఆధ్వర్యంలో నగదు, నిత్యావసరాలు పంపిణీ చేశారు. ట్రస్టు అధ్యక్షులు మోసుగంటి వెంకటేశ్వరరావు, రుద్రరాజు రమేష్‌రాజు, డాక్టర్ మోసుగంటి రవితేజ, ఈతకోట సతీష్ తదితరులు బాధిత కుటుంబాన్ని పరామర్శించారు.

అసిస్టెంట్ ఎలక్టోరల్ అధికారిగా జ్యోతి నియామకం

యానాం: యానాం అసెంబ్లీ నియోజకవర్గానికి అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారిగా సబ్ తాలూకా ఆఫీసు డిప్యూటీ తహసీల్దార్ ఆర్ జ్యోతి వెంకటేశ్వరరావును నియమిస్తూ సోమవారం పుదుచ్చేరి జిల్లా ఎలక్షన్ అధికారి ఎంఎం వినయ్‌రాజ్ ఆదేశాలు జారీ చేశారు. రాజ్ భవన్, బాహోర్ నియోజకవర్గాలకు సైతం నూతనంగా అసిస్టెంట్ ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ అధికారులను నియమించారు.

ప్రయాణం.. నరకప్రాయం!

- అధ్వానంగా గుడ్డివానిచింత–ఎస్.పల్లిపాలెం రోడ్డు
- ప్రమాదాల పాలవుతున్న వాహన చోదకులు
- నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు
- వైఎస్సార్ సీపీ హయాంలో నాటి మంత్రి విశ్వరూప్ చొరవతో నిధుల మంజూరు



సామంతకుర్రు వద్ద అడ్డు వచ్చిన ఇళ్లను తొలగించక పోవడంతో మధ్యలోనే నిలిచి పోయిన సీసీ రోడ్డు



జేసీబీతో తవ్వేయడంతో రాళ్లు లేచిన రహదారి

అల్లవరం: ప్రయాణం సజావుగా సాగాలంటే రహదారి బాగుంటేనే సాధ్యం. రోడ్లు బాగుంటేనే సమయానికి గమ్య స్థానాలకు చేరుకోవడం సులభమవుతుంది. అదే రోడ్లు అధ్వానంగా ఉంటే గోతులు, గుంతల కారణంగా వాహనాలు పాడై ప్రయాణం ముందుకు సాగని దుస్థితి ఏర్పడుతుంది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు కావస్తున్నా ప్రధాన రోడ్డు నిర్మాణ పనుల ఊసే లేదు. పోనీ గత ప్రభుత్వంలో ప్రారంభించిన పనులను వేగంగా పూర్తి చేసి వినియోగంలోకి తీసుకొస్తారంటే అదీ నత్తనడకనే సాగుతోంది.

అల్లవరం ప్రధాన రహదారి గుడ్డివానిచింత నుంచి ఎస్.పల్లిపాలెం వరకు పది కిలోమీటర్ల పొడవున సెంట్రల్ రిజర్వ్ ఫండ్ నిధులు రూ.19 కోట్లతో అప్పటి మంత్రి పినిపే విశ్వరూప్ చొరవతో రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. సార్వత్రిక ఎన్నికలకు ముందు వరకు నిర్మాణ పనులు వేగంగా సాగాయి. ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతోనే రోడ్డు నిర్మాణ పనులకు గ్రహణం పట్టింది. అప్పటి నుంచి పనులు నత్తనడకన సాగడంతో ప్రయాణం నరక ప్రాయంగా మారింది. ఈ రోడ్డుపై ప్రయాణమంటే వాహన చోదకులు బెంబేలెత్తిపోతున్నారు. వెన్నుపూస కదిలి పోయేంతగా ప్రయాణం ప్రమాదకరంగా మారింది. దీనికి తోడు రోడ్డు నిర్మాణం కోసం జేసీబీతో ఉన కొద్దిపాటి రోడ్డును సైతం తవ్వేస్తున్నారు. తవ్వేసిన రోడ్డుపై రాళ్ల మధ్యన ప్రయాణించాలంటే వణుకు పుడుతోంది. ద్విచక్ర వాహనాలు అదుపు తప్పుతున్నాయి. మోటారు సైకిళ్లు, కార్లకు రాళ్ల గుచ్చుకోవడంతో పంచర్లు పడి జేబులు గుల్లవుతున్నాయి. నిర్మాణ పనులు ప్రారంభించి 16 నెలలు కావస్తున్నా నేటికి 50 శాతం పనులు మాత్రమే పూర్తి చేశారు.

దేవగుప్తం, ఎంట్రుకోన గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణం పూర్తి కాగా సామంతకుర్రులో రోడ్డు నిర్మాణం మధ్యలో ఆగిపోయింది. ప్రస్తుతం దేవగుప్తం నుంచి గుడ్డివానిచింత వరకు జేసీబీతో రోడ్డును తవ్వేస్తున్నారు. దీంతో ప్రయాణికులు, వాహన దారులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఆర్అండ్‌బీ అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి నిర్మాణ పనుల్లో వేగాన్ని పెంచి రోడ్డు నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాలని కోరుతున్నారు.

సగం పనులూ పూర్తి కాలేదు



సామంతకుర్రు నుంచి గుడ్డివాని చింత వరకు ప్రయాణం చేయాలంటే భయంగా ఉంటోంది. రోడ్డంతా రాళ్లుతేలి వాహనాలు అదుపు తప్పుతున్నాయి. దీంతో చోదకులు కిందపడి గాయాల పాలవుతున్నారు. ఏడాది క్రితం రహదారి పనులు ప్రారంభించినా నేటికి సగం కూడా పూర్తి కాలేదు. ఎప్పటికి పూర్తి చేస్తారో తెలియదు. అధికారులు నిర్లక్ష్యాన్ని వీడాలి.

కర్రి శ్రీనివాసరావు, స్థానికుడు, సామంతకుర్రు.

ప్రమాదాల రహదారి

అమలాపురం రూరల్: మండలంలోని రెడ్డిపల్లి పంచాయతీ పరిధి నుంచి కామనగరువు మీదుగా అమలాపురం వెళ్లే ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారింది. గతంలో ఉప్పలగుప్తం మండలం భీమనపల్లి పంచాయతీ పరిధి సింగాగయిపాలెం నుంచి విలసవిల్లి మీదుగా రెడ్డిపల్లి వరకు రోడ్డు నిర్మాణాన్ని చేపట్టారు. కామనగరువు పంచాయతీ పరిధిలో కొంత భాగం మిగిలిన రోడ్డును నిర్మించడానికి చర్యలు చేపట్టారు. దీని నిమిత్తం రెడ్డిపల్లిలో సీసీ రోడ్డుకు ఉన్న అప్రోచ్‌లను అధికారులు ఆకస్మాత్తుగా తొలగించటంతో అటుగా వస్తున్న ప్రయాణికులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన మండల వాసులు జిల్లా కేంద్రం అమలాపురానికి ఈ మార్గం గుండా ఎక్కువగా ప్రయాణిస్తుంటారు. ఎటువంటి హెచ్చరిక బోర్డులు లేకుండా అప్రోచ్‌లను తొలగించటంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



ప్రమాదకరంగా మారిన కామనగరువు- రెడ్డిపల్లి రహదారి

ఆకట్టుకున్న లేగదూడల ప్రదర్శన



ప్రదర్శనలో ఉంచిన లేగదూడలను తిలకిస్తున్న ప్రజా ప్రతినిధులు

అల్లవరం: పశు పోషణకు అధిక ప్రాధాన్యమిస్తున్నట్లు ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావు పేర్కొన్నారు. డి.రావులపాలెంలో ఏడీ విజయారెడ్డి ఆధ్వర్యంలో పశువైద్య శిబిరంతో పాటు లేగ దూడల ప్రదర్శనను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే ఆనందరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శనను తిలకించారు. ఒంటెద్దు స్వామినాయుడుకు చెందిన లేగదూడ మొదటి స్థానం, తిక్కా లక్ష్మణస్వామి, బొబ్బిలి సత్యనారాయణలకు చెందిన లేగదూడలు రెండు, మూడు స్థానాలు దక్కించుకున్నాయి. శిబిరంలో 232 పశువులకు నట్టల నివారణ టీకాలు వేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, సర్పంచ్ ఉండ్రు భగవాన్ దాసు, ఎంపీటీసీ తిక్కా శేషుబాబు, పశు వైద్యాధికారి మేడిద నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ఉప్పలగుప్తం: స్థానిక గ్రామ పంచాయతీ పరిధి పాపాయిచెరువు కొత్త కాలనీలో రూ.5 లక్షల గ్రామ పంచాయతీ నిధులతో నిర్మిస్తున్న రోడ్డుకు సర్పంచ్‌ల సమాఖ్య మండల అధ్యక్షుడు కడిమి చిన్నవరాజు సోమవారం శంకుస్థాపన చేశారు. గత కొన్ని సంవత్సరాలుగా ఈ ప్రాంతంలో రోడ్డు సౌకర్యం లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో నిర్మాణానికి శ్రీకారం చుట్టామని సర్పంచ్ చిన్నవరాజు తెలిపారు.

వాడీవేడిగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

- పర్యవేక్షణ అధికారులు లేకపోవడంపై నిలదీసిన ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు
- క్వాలిటీ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ అధికారులను తక్షణమే నియమించాలని డిమాండ్
- రోడ్ల విస్తరణకు, వంతెనల నిర్మాణాలకు రూ.65 కోట్లతో అంచనాలు



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, చిత్రంలో ఎమ్మెల్యే ఆనందరావు, పాలక, ప్రతిపక్ష కౌన్సిలర్లు

అమలాపురం టౌన్: అమలాపురం మున్సిపాలిటీలో క్వాలిటీ కంట్రోల్ అధికారి లేక అభివృద్ధి పనుల్లో నాణ్యతా లోపాలు, ఫుడ్ సేఫ్టీ అధికారి లేక ఆహార కలుషిత లోపాలు అనివార్యమవుతున్నాయని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఆవేదన వ్యక్తం చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి అధ్యక్షతన స్థానిక మున్సిపల్ కార్యాలయంలో సోమవారం ఉదయం జరిగిన కౌన్సిల్ సమావేశంలో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు, ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావులు పాల్గొని పలు సమస్యలను లేవనెత్తి మాట్లాడారు. తక్షణమే మున్సిపాలిటీకి క్వాలిటీ కంట్రోల్, ఫుడ్ సేఫ్టీ అధికారులను నియమించాలని డిమాండ్ చేశారు. మున్సిపాలిటీలో జరుగుతున్న రూ.కోట్ల విలువైన అభివృద్ధి పనుల్లో నాణ్యత చూసే అధికారి లేరని ఆరోపించారు. పనుల్లో నాణ్యతా లోపాలను గుర్తించే అధికారి లేకపోవడంతో ఇక్కడి అధికార్లు ఆడిందే ఆటగా మారిందని ఆరోపించారు.

పెండింగ్ బిల్లులపై నిలదీత

ఇప్పటికే రూ.4 కోట్ల వరకూ చేసిన అభివృద్ధి పనులకు బిల్లులు పెండింగ్ ఉండగా మరో రూ.7 కోట్లతో 97 పనులకు టెండర్లు పిలవడంపై ఎమ్మెల్యే ఆనందరావు కమిషనర్ రాజును నిలదీశారు. నిబంధనల ప్రకారం సాధారణ నిధులను ఖర్చు చేయడం లేదని ధ్వజమెత్తారు. దీనిపై జిల్లా కలెక్టర్ చేత విచారణ చేయిస్తానని అన్నారు. పాలక పక్ష కౌన్సిలర్లు గొవ్వాల రాజేష్, మట్టపర్తి నాగేంద్రలు మాట్లాడుతూ పనుల కేటాయింపులో 30 వార్డులకు న్యాయం జరిగేలా పనులు మంజూరు చేస్తామని వివరించారు. ప్రతిపక్ష కౌన్సిలర్లు యేడిద శ్రీను, అబ్బిరెడ్డి చంటి, తిక్కా సత్య లక్ష్మి, పిండి అమరావతి తదితరులు తమ వార్డుల్లో అభివృద్ధి పనుల్లో పక్షపాతం చూపుతున్నారని ఆరోపించారు.

ఈదరపల్లికి ప్రత్యామ్నాయ వంతెన

ఈదరపల్లి వంతెన శిథిలావస్థకు చేరుకుందని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. వచ్చే మార్చి నాటికి ఈదరపల్లి వంతెన పక్కనే ప్రత్యామ్నాయంగా మరో వంతెన నిర్మాణం చేపడుతున్నట్లు తెలిపారు. ఈ లోగా ఈదరపల్లి వంతెనపై నుంచి భారీ వాహనాల రాకపోకలను నిలిపివేయాలని కమిషనర్ రాజుకు సూచించారు. పట్టణ మాస్టర్ ప్లాన్ అమలులో భాగంగా రోడ్ల విస్తరణకు, ఏడు వంతెనల నిర్మాణాలకు రూ.65 కోట్లతో అంచనాలు రూపొందించామన్నారు. మున్సిపల్ డీఈఈ నాగ సతీష్, ఆర్వో శ్రీలక్ష్మి తమ శాఖల గురించి మాట్లాడి ఎమ్మెల్సీ, ఎమ్మెల్యే, కౌన్సిలర్లు లేవనెత్తిన అంశాలపై వివరణ ఇచ్చారు.

సబ్ ట్రెజరీ ఉద్యోగికి సత్కారం



ముమ్మిడివరంలో ట్రెజరీ ఎస్ఏ కోలా కృష్ణను సత్కరిస్తున్న ఎస్టీవో భగవాన్

ముమ్మిడివరం: ట్రెజరీస్ అండ్ అకౌంట్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉత్తమ సేవలకు గానూ జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారం పొందిన స్థానిక సబ్ ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్ (ఎస్ఏ) కోలావుత్ర వెంకట నాగ భీమకృష్ణను వివిధ ప్రభుత్వ శాఖల సబ్ డివిజన్, మండల స్థాయి అధికారులు, సిబ్బంది అభినందించారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా ఆదివారం అమలాపురంలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ ఆర్ మహేష్‌కుమార్ చేతుల మీదుగా జిల్లా స్థాయి ఉత్తమ సేవా పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా సోమవారం స్థానిక సబ్ ట్రెజరీ కార్యాలయంలో ఎస్‌టీఓ వర్ధినీడి గోపాల భగవాన్ ఆధ్వర్యంలో కార్యాలయ సిబ్బందితో పాటు రిటైర్డ్ ఎంఈఓ రమణశ్రీ,, వివిధ మండలాల ఎంఈఓలు, వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది ఘనంగా సత్కరించారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు

అమలాపురం రూరల్: దక్షిణ భారతదేశ స్థాయిలో విద్యా, వైజ్ఞానిక ప్రదర్శనలో అమలాపురం మండలం వన్నె చింతలపూడి ఉన్నత పాఠశాల రూపొందించిన మల్టీ పర్పస్ సైక్లింగ్ మిల్ ప్రాజెక్టునకు ద్వితీయ బహుమతి లభించింది. పుదుచ్చేరిలో ఈ నెల 21వ తేదీ నుంచి 25 వరకు నిర్వహించిన దక్షిణ భారతదేశ సైన్స్ ఫెయిర్‌లో యంత్ర పరికరాలను రూపొందించిన విద్యార్థులు పుదుచ్చేరి అసెంబ్లీ స్పీకర్ సెల్వం, విద్యాశాఖ మంత్రి ఏ.నమశ్శివాయల చేతుల మీదుగా మెమెంటో, నగదు బహుమతి అందుకున్నారని హెచ్ఎం నాగసత్యనారాయణ సోమవారం తెలిపారు.

మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డుపై హర్షం

అమలాపురం టౌన్: ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగకు పద్మశ్రీ అవార్డు రావడం పట్ల డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ ఎంప్లాయిస్ అసోసియేషన్, మాదిగ ఎంప్లాయిస్ ఫెడరేషన్ ప్రతినిధులు హర్షం వ్యక్తం చేశారు. స్థానిక వాసంశెట్టి సుభాష్ లే అవుట్‌లో సోమవారం జరిగిన సంయుక్త సమావేశంలో ఎంప్లాయిస్ అసోసియేషన్ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు మడికి శ్రీరాములు మాట్లాడారు. అసోసియేషన్ నాయకుడు తెన్నేటి రాజబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వచ్చే నెలలో మంద కృష్ణ మాదిగ హైదరాబాద్‌లో నిర్వహించనున్న లక్ష డప్పులు, వేయి గొంతుల కార్యక్రమంపై చర్చించారు. అసోసియేషన్, ఫెడరేషన్ నాయకులు యార్లగడ్డ రవీంద్ర, మట్టా నాగేశ్వరరావు, ముమ్మిడివరపు వెంకటేశ్వరరావు, సీలి శ్యాంసన్ తదితరులు పాల్గొన్నారు.

పాము కాటుకు కుక్క బలి

ముమ్మిడివరం: మండల పరిధిలోని గేదెల్లంక గ్రామంలో తాచుపాము కుక్కను కరవడంతో అది మృత్యువాత పడింది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు గ్రామానికి చెందిన నిమ్మన బాలకృష్ణ ఇంటి సమీపంలోని కొబ్బరితోటలో చెరబడిన పాము కుక్క పిల్లను చంపి మింగేందుకు ప్రయత్నించింది. తల్లికుక్క అదేపనిగా మొరగడంతో బాలకృష్ణ అతని సోదరులు చూసి స్నేక్ క్యాచర్ వర్మకు సమాచారం ఇచ్చారు. సంఘటనా స్థలానికి వర్మ చేరుకుని తాచుపామును చాకచక్యంగా పట్టుకుని సురక్షిత ప్రాంతానికి తరలించడంతో స్థానికులు ఊపిరి పీల్చుకున్నారు.

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తాళ్లరేవు: పశు సంవర్ధక శాఖ అందిస్తున్న సబ్సిడీ పథకాలను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని ఆ శాఖ జాయింట్ డైరెక్టర్ సూర్యప్రకాశరావు అన్నారు. పి.మల్లవరం పంచాయతీ పత్తిగొంది గ్రామంలో పశు ఆరోగ్య శిబిరాన్ని సోమవారం ఎంపీపీ రాయుడు సునీత ప్రారంభించారు. నేషనల్ లైఫ్ స్టాక్ మిషన్ కార్యక్రమంలో భాగంగా 50 శాతం సబ్సిడీతో రూ.50 లక్షల వరకు గొర్రెలు, మేకల పెంపకానికి ప్రభుత్వం రుణసాయం అందిస్తుందన్నారు. పీఎంఈజీ పథకంలో భాగంగా గేదెలు, ఆవులకు 35 శాతం సబ్సిడీతో రూ.20 లక్షల వరకు రుణ సదుపాయం పొందవచ్చని తెలిపారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన లేగ దూడల ప్రదర్శనలో గిర్ జాతి ఆవుకు సంబంధించి వాసు రాజు, జెర్సీకి సంబంధించి గొల్లపల్లి వీర్రాజు, ముర్రా జాతికి సంబంధించి దంగేటి కొండయ్యలకు వరుసగా ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. కార్యక్రమంలో డీడీ అంబేద్కర్, ఏడీ బ్రహ్మవేద, గ్రామ సర్పంచ్ పంపన రామకృష్ణ, నాయకులు పాల్గొన్నారు.

చంద్రశేఖర్ సేవలు చిరస్మరణీయం

యానాం: రీజెన్సీ సిరామిక్స్ సంస్థ వైస్ ప్రెసిడెంట్ దివంగత చంద్రశేఖర్ సేవలు చిరస్మరణీయమని పలువురు పేర్కొన్నారు. సోమవారం ఆయన వర్ధంతి సంస్మరణ సభను స్థానిక పబ్లిక్ స్కూల్‌లో ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన విశ్రాంత తెలుగు ఉపాధ్యాయులు, కవి దాట్లదేవ దానం రాజు చంద్రశేఖర్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ చంద్రశేఖర్ ఉన్నత వ్యక్తిత్వం, పేద విద్యార్థులు, కార్మికులకు చేసిన అనేక సహాయ కార్యక్రమాలు చిరస్మరణీయాలని పేర్కొన్నారు. అనంతరం ఓల్డేజ్ హోంలో వృద్ధులకు పండ్లు, భోజనాలు అందించారు.

వెంకట రమణకు పలువురి పరామర్శ

తాళ్లరేవు: భార్యా వియోగంతో బాధ పడుతున్న విలేకరి వూడా వెంకట రమణను సోమవారం పలువురు పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు కాద గోవింద కుమార్, కాకినాడ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు, నాయకులు గంగిరెడ్డి సత్తిబాబు, కొటికెలపూడి చంద్రశేఖర్, పెయ్యల శ్రీనివాస్, ఎంపీడీఓ కె.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు విజెవి రమణ, నున్న శంకరనారాయణ, సూరంపూడి వెంకటరమణ, టేకుమూడి వేణుగోపాల్ తదితరులు పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కార్మిక నేత మురళీ మోహన్‌కు నివాళి

యానాం: రీజెన్సీ వర్కర్స్ యూనియన్‌ నేత దివంగత మచ్చా మురళీ మోహన్ వర్ధంతిని సోమవారం కార్మికుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక రీజెన్సీ గేటు ఎదురుగా జరిగిన కార్యక్రమంలో ముందుగా మురళీ మోహన్ సతీమణి దుర్గ చేతుల మీదుగా కార్మిక జెండాను ఆవిష్కరించారు. అనంతరం కుటుంబ సభ్యులు, అధిక సంఖ్యలో కార్మికులు మురళీమోహన్ చిత్రపటం వద్ద నివాళులర్పించారు.

పీఎంఈజీపీపై నేడు అవగాహన సదస్సు

యానాం: జిల్లా పరిశ్రమల కేంద్రం ఆధ్వర్యంలో మంగళవారం ప్రధాన మంత్రి ఉపాధి కల్పనా కార్యక్రమం (పీఎంఈజీపీ)పై స్థానిక ఆర్ఏఓ కార్యాలయంలో జిల్లా స్థాయి అవగాహన సదస్సు జరుగుతుందని అధికారులు తెలిపారు. ఈ పథకం ద్వారా పరిశ్రమలు, సేవా రంగాల్లో స్వయం ఉపాధి కల్పన కొరకు బ్యాంకుల ద్వారా రాయితీతో కూడిన రుణాలను పొందవచ్చునన్నారు. యానాం నియోజకవర్గ పరిధిలోని నిరుద్యోగ యువతీ, యువకులు ఈ సదస్సులో పాల్గొని అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకు మిని సివిల్ స్టేషన్‌లో యానాం జిల్లా పరిశ్రమల కేంద్రాన్ని సంప్రదించాలని కోరారు.

మద్యం షాపుల ఏర్పాటుకు దరఖాస్తులు

అమలాపురం రూరల్: గీత కులాలకు మద్యం షాపుల కోసం దరఖాస్తులు కోరుతునట్లు జిల్లా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కేవీడీస్ ప్రసాద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రామచంద్రపురం రూరల్ షాపు గౌడ కులస్తులకు మిగిలిన 12 షాపులను శెట్టిబలిజ సామాజిక వర్గాలకు కేటాయించడం జరిగిందన్నారు. దరఖాస్తులను వచ్చేనెల 5వ తేదీ సాయంత్రం ఐదు గంటల లోపు అందించాలన్నారు.

రక్షణ కల్పించరూ!

అమలాపురం రూరల్: అల్లవరం మండలం గోడిలంక గ్రామం రాజుగారి వీధిలో పంచాయతీ సిమెంటు రోడ్డును సర్పంచ్ రుద్రరాజు లక్ష్మీపతిరాజు, సురేష్‌రాజు,వేగిరాజు శ్రీనురాజులు జేసీబీతో ధ్వంసం చేశారని గతంలో తాను చేసిన ఫిర్యాదును ఉపసంహరించుకోవాలని బెదిరింపులకు పాల్పడుతున్నట్లు గ్రామానికి చెందిన రుద్రరాజు వెంకటరాజు కలెక్టర్‌కు సోమవారం ఫిర్యాదు చేశారు. రోడ్డును తవ్విన వ్యక్తులతో పాటు మరికొంత మంది అర్ధరాత్రి సమయాల్లో తన ఇంటికి వచ్చి చంపుతామని హెచ్చరిస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

నైపుణ్య శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

ముమ్మిడివరం: నైపుణ్యాల ద్వారా జీవనోపాధి కల్పనలో భాగంగా మెప్మా ద్వారా ఏర్పడిన హోమ్ ట్రయాంగిల్ కార్యక్రమానికి సంబంధించి పలువురు తమ దరఖాస్తులను అందజేశారు. ముమ్మిడివరం నగర పంచాయతీ కౌన్సిల్ హాల్‌లో ఈ మేరకు సోమవారం మున్సిపల్ కమిషనర్ పిన్నమరాజు రవి వర్మ ఆధ్వర్యంలో రిజిస్ట్రేషన్ కోసం సమావేశం నిర్వహించారు. కార్పెంటర్, ప్లంబర్, ఎలక్ట్రీషియన్, ఏసీ మెకానిక్ తదితర కోర్సులలో శిక్షణ ఇవ్వనున్నారు. సమావేశంలో మెప్మా సీఎంఎం సోమాని భాస్కర్, సీఓ రాజేశ్వరి, ఆర్పీలు పాల్గొన్నారు.

మా ప్రాణాలను కాపాడండి

అల్లవరం: కోడి పందేల సమయంలో జరిగిన గొడవ కారణంగా నలుగురు వ్యక్తుల నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని కోడూరుపాడులోని గుబ్బల వారిపాలేనికి చెందిన గుబ్బల రవికుమార్ దంపతులు జిల్లా ఎస్పీకి సోమవారం ఫిర్యాదు చేశారు. దేశికోడు వంతెన వద్ద కోడి పందేల బరిలో గొడవ జరగగా, మరునాడు పెద్దల సమక్షంలో గొడవ సద్దుమణిగిందని రవి తెలిపారు. రెండు రోజుల క్రితం నలుగురు వ్యక్తులు వీరమల్లు దేవ, రాచూరి వీరబాబు, జాలెం నాగార్జున, నాగారపు ఆకాష్‌లు తమ ఇంటి వద్దకు వచ్చి చంపేస్తామని బెదిరించారని తెలిపారు. వీరి నుంచి తన కుటుంబానికి ప్రాణహాని ఉందని రక్షణ కల్పించాలని కోరుతూ ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

జిప్‌మెర్ డైరెక్టర్‌గా వీర్‌సింగ్ నేగీ

యానాం: జిప్‌మెర్(జవహర్‌లాల్ నెహ్రూ ఇనిస్టిట్యూట్ ఆఫ్ పోస్టు గ్రాడ్యుయేట్ మెడికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్) నూతన డైరెక్టర్‌గా వీర్‌సింగ్ నేగీని నియమిస్తూ సోమవారం కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన ఆల్ ఇండియా మెడికల్ సైన్సెస్ , బిలాస్‌పూర్‌కు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్‌గా వ్యవహరిస్తున్నారు. జిప్‌మెర్ డైరెక్టర్‌గా ఆయన అయిదేళ్లు పదవిలో ఉంటారు. 2019లో రాకేష్ అగర్వాల్ డైరెక్టర్‌గా నియమితులు కాగా 2023లో ఆయన పదవీ కాలం ముగిసింది. అయినప్పటికీ 2024 డిసెంబర్ వరకు ఆయన పదవీ కాలాన్ని ప్రభుత్వం పొడిగిస్తూ వచ్చింది. యానాంలో ఉన్న జిప్‌మెర్ సైతం పుదుచ్చేరి జిప్‌మెర్ పరిధిలోకి వస్తుంది.

మహిళలకు కుట్టు మెషీన్ల అందజేత



తాళ్లరేవులో మహిళలకు కుట్టు మెషీన్లు అందజేస్తున్న శామ్యూల్ సాగర్

తాళ్లరేవు: క్రీమ్ సేవా సంస్థ ఆధ్వర్యంలో సోమవారం 80 మంది మహిళలకు జెడ్పీటీసీ సభ్యులు, క్రీం సేవా సంస్థ ప్రతినిధి దొమ్మేటి శామ్యూల్ సాగర్ కుట్టు మెషీన్లను పంపిణీ చేశారు. స్థానిక క్రీం కాంపౌండ్‌లో నిర్వహిస్తున్న ఉచిత కుట్టు శిక్షణా కార్యక్రమం ముగిసింది. ఈ నేపథ్యంలో శిక్షణ పొందిన తాళ్లరేవు, జార్జీపేట, మెట్టకుర్రు గ్రామాలకు చెందిన మహిళలకు కుట్టు మెషీన్లతో పాటు ధ్రువపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో దొమ్మేటి వెంకట నాగ దుర్గాదేవి, మహిళలు పాల్గొన్నారు.